# సాక్షి తిరుపతి

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025






## నారాసుర పానం!

కల్తీ మద్యం కేసులో పెద్దలను అరెస్టు చేయాలని చిత్తూరులో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు నిరసన చేపట్టారు.

- IIలో



## అసలు నిందితులను అరెస్టు చేయాలి

చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగలపెట్టిన నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

- IIలో



## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రగడ

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం సబ్ రిజిస్ట్రార్, అటెండర్ మధ్య రగడ చోటు చేసుకుంది.

- IIలో

## న్యూస్‌రీల్

### నేటి నుంచి బోధనేతర పనులు బంద్



మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో, ఎస్టీయూ నేతలు

**తిరుపతి సిటీ** : ప్రభుత్వం నిర్ణయించిన మితి మీరిన బోధనేతర పనులతో సమయం హరించుకుపోతోందని, శుక్రవారం నుంచి ఆ పనులను నిలిపివేస్తున్నట్లు ఏపీ ఫ్యాప్టో, ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఎస్టీయూ) ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. ఈ మేరకు గురువారం తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖాధికారికి ఎస్టీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బోధన సమయం కంటే బోధనేతర వ్యవహారాలు పెరిగిపోయాయని, ఈ విషయంపై పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు చదువు చెప్పడంతో పాటు, బోధనేతర పనులతో ఉపాధ్యాయులు ఒత్తిడికి గురై పలు వ్యాధులకు లోనవుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలు తప్ప ఏ ఇతర బోధనేతర పనులు చేయబోమని తేల్చి చెప్పారు. అనవసరమైన గూగుల్ షీట్స్, విద్యాశక్తి, జీఎస్టీ వంటి ప్రభుత్వ సీజనల్ ప్రచారాలను ఉపాధ్యాయులు ఇక నుంచి చేయరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం చైర్మన్ సాయి శ్రీనివాస్, కార్యదర్శి చిరంజీవి, నరహరి, ప్రకాష్‌రావు, వెంకటేశ్వర్లు, మనోజ్ కుమార్, సభ్యులు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### టీటీడీ డిప్యూటీ ఈఓల బదిలీ

**తిరుపతి అన్నమయ్య సర్కిల్** : టీటీడీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న డిప్యూటీ ఈఓలను బదిలీ చేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓగా పనిచేస్తున్న లోకనాథంను తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయానికి బదిలీ చేశారు. అలాగే శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓగా హరీంద్రనాథ్‌ను నియమించారు. హెచ్‌ఆర్ డిప్యూటీ ఈఓగా భాస్కర్, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి డిప్యూటీ ఈఓగా శాంతిని బదిలీ చేశారు. కాగా ఆర్–1 డిప్యూటీ ఈఓగా నియమితులైన రాజేంద్రకు ఆర్–2 ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తిరుమల అన్నదానం డిప్యూటీ ఈఓగా సెల్వం, తిరుపతి అన్నదానం డిప్యూటీ ఈఓగా వెంకటయ్య, కల్యాణకట్ట డిప్యూటీ ఈఓగా గోవిందరాజన్‌కు డోనర్ సెల్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

# ఆంక్షల యూరియా!

రబీ సీజన్ అదును దాటిపోతోందని యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. మరోవైపు యూరియాపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. వ్యవసాయశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డు ఉన్న రైతుకు మూడు విడతల్లో ఎకరాకు 3 బస్తాలు మాత్రమే పంపిణీ చేస్తుండడంపై ఆందోళన రేకెత్తిస్తోంది. యూరియాపై ఎప్పుడూ లేని ఆంక్షలు విధిస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇలా అయితే వ్యవసాయం చేయలేమని నిట్టూరుస్తున్నారు.




## గుర్తింపు కార్డు ఉంటేనే యూరియా

- ఓవైపు క్యూలు.. మరోవైపు పడిగాపులు
- రబీలో వరినాట్లకు సిద్ధంగా నారుమడులు
- సకాలంలో యూరియా అందక అగచాట్లు
- అన్నదాతల అవస్థలు ప్రభుత్వానికి పట్టవా?



వరదయ్యపాళెం : వ్యవసాయ కార్యాలయం వద్ద యూరియా కోసం గుమికూడిన రైతులు

**వరదయ్యపాళెం** : యూరియా కోసం రైతుల పాట్లు మొదలయ్యాయి. మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్దకు రైతులు క్యూ కడుతున్నారు. ఇప్పటికే వరదయ్యపాళెం మండలంలో రబీలో వరినాట్ల కోసం పూర్తి స్థాయిలో నారు మడులను సిద్ధం చేసుకున్నారు. వాటికి తక్షణమే యూరియా వేయాల్సి ఉంది. అందు కోసం వారం రోజుల నుంచి అటు కార్యాలయం , ఇటు ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు పెడుతున్నా యూరియా దొరకడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### రైతులపై నిబంధనల కత్తి

ప్రభుత్వం యూరియాపై పలు ఆంక్షలు విధిస్తోంది. ఆ దిశగా పొలం ఉన్న రైతుకు యూరియా పంపిణీ కోసం రబీ సీజన్‌లో ప్రభుత్వం ద్వారా ఇచ్చే గుర్తింపు కార్డు తీసుకున్న రైతుకు మాత్రమే యూరియా పంపిణీ జరుగుతుందని ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ దిశగా గుర్తింపు కార్డు పొందిన రైతుకు మూడు విడతల్లో ఎకరాకు 3 బస్తాలు మాత్రమే పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అందుకు సంబంధించి రైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్దకు క్యూ కడుతున్నారు. అది కూడా పొలానికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు, ఆన్‌లైన్ నమోదు వివరాలను క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బందికి అందజేసిన వారికి రెండు రోజుల తర్వాత కార్డులను జారీ చేస్తున్నారు. తదుపరి యూరియా సరఫరా జరుగుతుందని అధికారులు చెబుతుండడం గమనార్హం.



గుర్తింపు కార్డుల కోసం వేచి ఉన్న రైతులు



రైతులకు ప్రభుత్వం అందిస్తున్న గుర్తింపు కార్డు

### సీజన్ దాటిపోతుందని గుబులు

ఇప్పటికే వరదయ్యపాళెం మండలంలో 12 వేల ఎకరాల వరి సాగు కోసం మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో రైతులు నారుమడులను సిద్ధం చేసుకున్నారు. ఆ మేరకు వరి వంగడాలను విత్తడంతో నారు మొలకెత్తింది. అయితే సకాలంలో యూరియా పిచికారి చేస్తే నారు ఏపుగా పెరుగుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా అందకపోవడంతో అదును దాటిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడూ లేని ఆంక్షలు విధించడంతో ఈ ఏడాది వ్యవసాయం సాఫీగా జరుగుతుందా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

### వేధిస్తున్న సిబ్బంది కొరత

సత్యవేడు నియోజకవర్గంలో అత్యధికంగా రబీ సీజన్‌కు 12 వేల ఎకరాల్లో వరిసాగు వరదయ్యపాళెం మండలంలోనే సాగవుతుంది. అయితే క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. అటు ఈ–క్రాప్ బుకింగ్, ఇటు యూరియా పంపిణీ ఉన్నా అరకొర సిబ్బందితో సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆ శాఖ అధికారులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో 11 రైతు సేవా కేంద్రాలు ఉండగా అక్కడ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది ఆరుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఐదుగురు సిబ్బంది కొరత కారణంగా ఎక్కడికక్కడ పనులు ఆగిపోతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

#### నాలుగు రోజులుగా తిరుగుతున్నా



"నాకు రెండెకరాల పొలం ఉంది. యూరియా కోసం నాలుగు రోజులుగా తిరుగుతూనే ఉన్నా. గుర్తింపు కార్డు ఉంటేనే యూరియా ఇస్తామంటున్నారు. అందు కోసం వివరాలు సమర్పించా. అయినా అందలేదు. రూ. 270 యూరియా బస్తా కోసం రూ. 500 అదనపు ఖర్చు అవుతోంది.

– సుబ్రమణ్యం, రైతు, నాగనందాపురం

#### ఇంత దారుణం ఎప్పుడూ లేదు



యూరియా కోసం ఇన్ని ఇబ్బందులు పడడం ఎప్పుడూ లేదు. ఇలా ఉంటే వ్యవసాయం కష్టం . యూరియా కోసం తిరగడానికే సమయం సరిపోతుంది తప్ప సకాలంలో వ్యవసాయ పనులు చేపట్టలేం. రైతులను ఇంతగా ఇబ్బంది పెట్టడం సరికాదు. రైతే దేశానికి వెన్నెముక అంటారు గానీ అది ఆచరణలో సాధ్యం కావడం లేదు.

– ముద్దుకృష్ణా రెడ్డి, రైతు, గూడలవారిపాళెం

#### గుర్తింపు కార్డుల పంపిణీ మొదలు పెట్టాం



యూరియా పంపిణీ కోసం రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నాం. ఇప్పటికే వివరాలు అందజేస్తున్న రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే యూరియా అందజేస్తాం. మొదటి విడతగా 1200 బస్తాలు తెప్పించాం. మూడు విడతల్లో యూరియా పంపిణీ ప్రక్రియ జరుగుతుంది.

– గౌరి, ఏఓ, వరదయ్యపాళెం మండలం

## శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తుల వేచి ఉన్న క్యూ శిలా తోరణం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 74,861 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,802 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

## మిగిలిపోయిన భోజనం పెట్టొద్దు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్**:వసతిగృహాల్లోని పిల్లలకు పెళ్లితో పాటు ఇతర కార్యక్రమాల్లో మిగిలిపోయిన భోజనాన్ని పెట్టొద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ వార్డన్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏడాది కాలంలో పలుచోట్ల వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు కలుషిత ఆహారం తీసుకోవడంతో ఆరోగ్య ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం, తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే దెబ్బతిన్న భవనాలు ఉంటే పిల్లలను సురక్షితమైన మరో ప్రాంతానికి బదిలీ చేయాలని కోరారు. వర్షాల నేపథ్యంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నా రు. పిల్లల ఆరోగ్య రక్షణకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్కూల్ జోన్ పరిధిలో క్లోరినేషన్ చేపట్టాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదే శించారు. కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, డీఈవో కేవీఎన్ కుమార్, గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త పద్మజ, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

## తల్లుల వేదన.. బిడ్డల రోదన

- రుయాలో బాలింతలపై నిర్లక్ష్యం
- వరండాల్లో తల్లీబిడ్డల అవస్థలు



రుయా చిన్నపిల్లల ఆసుపత్రి వరండాలో మంచాలపై బాలింతలను ఉంచిన దృశ్యం



లగేజీలతో నేలపై సేద తీరుతున్న బాలింతల సహాయకులు

రాయలసీమకే తలమాణికమైన శ్రీ వెంకటేశ్వర రామనారాయణ రుయా ప్రభుత్వ సర్వజన చిన్నపిల్లల ఆసుపత్రిలో బాలింతల వేదన.. బిడ్డల రోదనతో ఆసుపత్రి దద్దరిల్లింది. బాలింతలకు వసతుల కల్పనలో ఆసుపత్రి ఉన్నతాధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. వార్డులు ఉన్నప్పటికీ వార్డు బయట మెట్ల పక్కన ఉన్న సన్‌సైడ్ గోడల కింద బెడ్లను వేసి బాలింతలు, పురిటి బిడ్డలకు నరకం చూపెట్టారు. ఓ వైపు దోమల విజృంభన, భరించలేని దుర్వాసనకు తోడు చలిగాలులతో బాలింతలు, బిడ్డల అవస్థలు అన్నీ ఇన్ని కావు. మరోవైపు సహాయకులు సైతం నేలపై పడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫ్రిజ్జులు, కొళాయిలు సైతం పనిచేయకపోవడంతో బాలింతలు, సహాయకులు అగచాట్లు పడ్డారు. లిఫ్టు పనిచేయకపోవడం, నిరుపయోగంగా ఉన్న బెడ్లు, మంచాలు, వీల్‌చైర్లు, పనికిరాని వస్తువులను అక్కడే నిర్లక్ష్యంగా పడేశారు. వాటి పక్కనే బాలింతలు, చంటి బిడ్డలను ఉంచడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



పనిచేయని లిఫ్టుకు అడ్డుగా పెట్టిన బల్ల



ఆసుపత్రి ఆవరణలోనే పనికిరాని వస్తు సామగ్రి






పనిచేయని కొళాయిలు, అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

## అడ్డు తొలగించారు!

### తిరుపతి జేసీ బదిలీ వెనుక రాజకీయం

- తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరిలో ఆక్రమణలకు చెక్
- గూడూరులో భారీ భూ ఆక్రమణను అడ్డుకున్న బన్సల్
- శుభం బన్సల్ బదిలీ వెనుక ఆ ఐదుగురు కూటమి నేతల హస్తం



శుభం బన్సల్ , జేసీ

**సాక్షి టాస్క్‌ఫోర్స్** : ఆక్రమణలను ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్న తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కూటమి నేతలు పట్టుబట్టి బదిలీ చేయించారు. జేసీగా శుభం బన్సల్ ఉన్నన్ని రోజులు స్వేచ్ఛగా ఆక్రమణలు చేయలేమని 'ముఖ్య' నేతలపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు చేశారు. మెజారిటీ కూటమి నేతలు కలిసి మూకుమ్మడిగా ఒత్తిడి చేసి జేసీ శుభం బన్సల్‌ని బదిలీ చేసి పంతం నెగ్గించుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గత ఏడాది జూలై 24న తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్ బాధ్యతలు చేపట్టారు. అధికారం వచ్చిన వెంటనే జిల్లా వ్యాప్తంగా కూటమి నేతలు భూ ఆక్రమణలకు తెరతీశారు. ఒకటి కాదు రెండు కాదు.. యథేచ్ఛగా ఆక్రమణలకు బరితెగించటం ప్రాంభించారు. అందులో ముఖ్యంగా గూడూరు నియోజక వర్గం చిల్లకూరు మండల పరిధిలో క్రిస్ సిటీ కోసం సేకరిస్తున్న భూముల్లో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఆ ప్రభుత్వ భూముల పేరుతో కూటమి నేతలు బినామీ పేర్లు చేర్చి పరిహారం కింద వచ్చే కోట్ల రూపాయలను జేబులు నింపుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. ఇదే చిల్లకూరు మండలం కడివేడు పరిధిలో కూటమి నేతల ఆక్రమణలో ఉన్న సీలింగ్ భూములకు రికార్డులు చేసుకునేందుకు యత్నించగా జేసీ అడ్డుపడుతూ వచ్చారు. ఇంకా వెంకటగిరి పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా జేసీ అడ్డుగా నిలిచారు.

### అడ్డుపడుతుండడంతో మింగుడుపడక

శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో కూటమి నేతల భూ ఆక్రమణలకు అడ్డుపడుతూ వచ్చారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని వికృతమాల పరిధిలో కూటమి నేతల అధీనంలో ఉన్న అక్రమ నిర్మాణాలకు అడ్డుచెప్పినట్లు తెలిసింది. శ్రీకాళహస్తి రూరల్ పరిధిలో ఏర్పేడు– వెంకటగిరి మార్గంలోని విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా జేసీ అడ్డుకున్నారు.తిరుపతి నగర పరిధిలోని ఎర్రమిట్ట వద్ద సర్వే నంబర్ 101లో కోట్ల రూపాయలు విలువైన భూమిని స్థానిక కూటమి నేతలు ప్లాట్లు వేసి పంచుకునేందుకు సిద్ధమయ్యారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలంటూ 28 పేర్లతో జాబితా సిద్ధం చేశారు. ఆ జాబితా ఫైల్‌ను జేసీ వద్దకు తీసుకెళ్లగా సంతకం చేయడానికి నిరాకరించినట్లు సమాచారం. అలాగే తిరుపతి నగరంలోనే మరికొన్ని ఆక్రమణలకు జేసీ అడ్డుపడుతూ వచ్చారు. చంద్రగిరి పరిధిలో ఇటీవల కాలంలో కూటమి నేతలు ఓ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. వారి నివాసానికి వెళ్లకుండా ఇనుప కంచెవేశారు. ఈ విషయాన్ని బాధితులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించకపోవడంతో బాధితులు నేరుగా జేసీ శుభం బన్సల్‌ని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వెంటనే స్థానిక అధికారులకు ఫోన్‌చేసి సీరియస్ అయినట్లు సమాచారం. స్థానిక అధికారులు జేసీపై కూటమి నేతలకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తిరుపతి రూరల్, మంగళం పరిధిలోని విలువైన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అడ్డుపడ్డారు. ఇంకా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట పరిధిలో విలువైన భూమిని ఆక్రమణకు గురికాకుండా అడ్డు కున్నారు. ఇదిలా ఉంటే.. తుడా వైస్ చైర్మన్‌గా జేసీని నియమించడంపై కూటమి నేతలు జీర్ణించుకోలేకపోయారు. వైస్ చైర్మన్‌గా ఆర్డీఓ స్థాయి అధికారి అయితే చెప్పినట్లు వింటారని కూటమి నేతలు నిర్ణయించుకున్నారు. నిజాయతీగా అధికారిగా పేరున్న శుభం బన్సల్ కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గకపోవడంతో అంతా ఏకమయ్యారు. కూటమి నేతలకు ఓ బడా పారిశ్రామిక వేత్త తోడయ్యారు. రెండు రోజుల క్రితం వీరంతా కలిసి 'ముఖ్య' నేతలపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేయడంతో బదిలీ చేశారని జోరుగా ప్రచారం సాగుతోంది.




**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.126,420 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.1,1,396 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.1,63,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.167.00 |

## క్లుప్తంగా

### రైలు నుంచి జారిపడి విద్యార్థి మృతి


సంతోష్ (ఫైల్)

**నాయుడుపేటటౌన్ :** నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో మెము రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి సంతోష్ (17) అనే విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. వరదయ్యపాళెంకు చెందిన సంతోష్ నెల్లూరు జిల్లాలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజు మాదిరిగా కళాశాలకు వెళ్లేందుకు స్నేహితులతో కలిసి తడలో మెము రైలు ఎక్కి బయలు దేరగా నాయుడుపేటకు రాగానే ఫుట్‌పాత్ సమీపంలో నిల్చున్న సంతోష్ కాలుజారి రైలు కింద పడిపోయాడు. గమనించిన స్నేహితులు చైన్ లాగి రైలు నిలుపుదల చేశారు. రైలు కిందపడి తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు.

### సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసే వ్యక్తి అరెస్టు

**తిరుపతి క్రైమ్ :** ప్రభుత్వ పనితీరు, నాయకులపై అసత్య ప్రచారాలు సోషల్ మీడియాలో చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెస్ట్ సీఐ మురళీమోహన్ పేర్కొన్నారు. కదిరికి చెందిన అంజద్ ఖాన్(43) కొంత కాలంగా నకిలీ ప్రొఫైల్ సృష్టించి పార్టీల మధ్య విభేదాలు రెచ్చగొట్టే విధంగా, ప్రముఖ నాయకుల మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు చేస్తున్నారని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేశారు.




బత్తలవల్లంలోని ఓ గోడౌన్‌లో నిల్వ చేసేందుకు లారీ నుంచి అన్‌లోడ్ చేస్తున్న మత్తు పదార్థాలు

మత్తు పదార్థాలను తమిళనాడు ప్రభుత్వం విక్రయించకుండా బ్యాన్ విధించింది. ఆ వ్యాపారంలో రాటుదేలిన అక్రమ వ్యాపారులు ఏకంగా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన వరదయ్యపాళెం మండలం బత్తలవల్లంలో మకాం పెట్టారు. దీంతో బత్తలవల్లం కేంద్రంగా మత్తు పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏకంగా బత్తలవల్లంలోని ఓ ఆలయ సమీపంలో గోడౌన్‌లో పెద్దఎత్తున గుట్కా, హాన్స్, ఇతర మత్తు పదార్థాలను భారీగా నిల్వలు చేసి అటు తమిళనాడు, ఇటు ఆంధ్రాలో విక్రయించి పెద్ద ఎత్తున అక్రమ వ్యాపారం చేపడుతున్నారు.

# ఆంధ్రాలో స్టాక్..
# తమిళనాడులో కిక్కు

- బత్తలవల్లం కేంద్రంగా మత్తు పదార్థాల విక్రయాలు
- ఆంధ్రా నుంచి గుట్టుచప్పుడు కాకుండా సరఫరా
- బత్తలవల్లంలో భారీ గోదాం
- గుట్కా, హాన్స్, ఇతర మత్తు పదార్థాల నిల్వలు

**వరదయ్యపాళెం :** ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గం అక్రమ వ్యాపారాలకు కేంద్రంగా మారుతోంది. ఆ దిశగా వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం కేంద్రంగా మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆంధ్రాలో లైసెన్సులు పొంది తమిళనాడులో అక్రమ మత్తు పదార్థాల వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో లక్షల్లో వ్యాపారం చేతులు మారుతున్నాయి.

**అక్రమంగా తరలిస్తూ..**

తమిళనాడులో హాన్స్, గుట్కా, ఇతర మత్తు పదార్థాలకు బ్యాన్ విధించడంతో బహిరంగ దుకాణాల్లో విక్రయించేందుకు వీలు లేదు. దీంతో ఆంధ్రాలో నిల్వలు ఉంచుకుని తమిళనాడుకు తరలిస్తూ ఈ అక్రమ మత్తు పదార్థాల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారు. సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు సమీపంలోని తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సరిహద్దు గ్రామాలు ఆరంబాకం, గుమ్మిడిపూండి, మాదరపాకం, కవరపేట ప్రాంతాల్లో విక్రయించేందుకు ఆంధ్రా నుంచి పెద్దఎత్తున తరలిస్తున్నట్లు సమాచారం. అంతేకాక ఆ ప్రాంతాల్లో మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు అధిక ధరలకు సైతం వీటిని కొనుగోలు చేస్తూ వ్యసనానికి బానిసలవుతున్నారు. నెలసరి మామూళ్లతో అధికారులను తమవైపు తిప్పుకుని వారి సహకారంతోనే ఈ అక్రమ వ్యాపారం కొనసాగిస్తుండడం గమనార్హం.

**పట్టించుకోని అధికారులు**

ప్రధానంగా మత్తు పదార్థాలు నిల్వల గురించి ఫుడ్ సేఫ్టీ అధికారులు, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు స్పందించాల్సి ఉంది. ఆంధ్రాలో మత్తు పదార్థాల విక్రయానికి బ్యాన్ లేని కారణంగా గోడౌన్‌కు లైసెన్సు ఉందా? వ్యాపార సామర్థ్యాన్ని బట్టి ట్యాక్స్ చెల్లిస్తున్నారా? లేదా? అని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు విచారణ చేయాల్సి ఉంది. ఒకవేళ లైసెన్స్ ఉంటే పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు లైసెన్సు రద్దు చేసేందుకు పంచాయతీ అధికారులకు అధికారం ఉంది. అయితే దర్జాగా మత్తు పదార్థాల నిల్వలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం అటువైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఇళ్ల మధ్యలో గోడౌన్**

మత్తు పదార్థాల అక్రమ వ్యాపారానికి సంబంధించి గోడౌన్‌ను బత్తలవల్లంలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేయడంపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ వ్యాపారాలను ఇళ్ల మధ్య నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చైనా దేశస్తుడి విచారణలో ఈడీ అధికారులు

**రేణిగుంట:** మండలంలోని గురవరాజు పల్లి సమీపంలో ఉంటున్న చైనా దేశస్తుడు డ్యూ యాంగస్‌ను ఈడీ అధికారులు బుధవారం ఉదయం నుంచి గోప్యంగా విచారణ జరుపుతున్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి ఈడీ ఉన్నతాధికారులు చేరుకొని విచారణ కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిగితే అసలు విషయాలు తెలుస్తాయి. ప్రస్తుతం ఈడీ అధికారులు ఎవరిని లోపలికి రానివ్వకుండా సమాచారం ఏదీ బయటకు తెలియకుండా గోప్యత పాటిస్తున్నారు. రాత్రి కేసు విషయాలను వెల్లడిస్తారని తెలిపారు. కానీ న్యూఢిల్లీ నుంచి ఉన్నతాధికారులు రావడంతో విచారణ రేపటి వరకు కొనసాగుతుందని సమాచారం.

## పిడుగుపాటుకు ఆవుల మృతి


పిడుగుపాటుకు మృతి చెందిన ఆవులు

**చిట్టమూరు:** మండలంలో గురువారం పిడుగుపడి మూడు ఆవులు మృతి చెందాయి. మండల పరిధిలోని మల్లాం గ్రామానికి చెందిన చెన్నారెడ్డి బాబురెడ్డికి చెందిన ఆవులు గ్రామానికి సమీపంలోని పొలాల్లో మేతకు వెళ్లాయి. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో పొలాల్లో పిడుగులు పడ్డాయి. దీంతో పొలాల్లో మేత మేస్తున్న బాబురెడ్డికి చెందిన మూడు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. అదృష్టవశాత్తు ఆవులు మేపుతున్న కాపరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదని స్థానికులు తెలిపారు.

# ప్రాణాలు తీస్తున్న..
# నారాసుర పానం!


చిత్తూరులో మద్యం బాటిళ్లను పగులగొట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు

**ఏరులై పారుతున్న కల్తీ మద్యం**
- అమాయకులు బలి
- కల్తీమద్యం పెద్దలను అరెస్ట్ చేయాలి
- ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మహిళా నేతల నిరసన

**చిత్తూరు అర్బన్:** 'నారా'వారి కల్తీ మద్యానికి అమాయకులు బలవుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మొలకలచెరువు నుంచి కల్తీ మద్యం ఏపీ మొత్తానికి సరఫరా అయ్యింది. ఆఫ్రికాలో ప్రణాళికలు రూపొందించి, పేదల ప్రాణాలను తీశారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారు..?' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. కల్తీ మద్యం కేసులో పెద్దలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. హైరోడ్డు నుంచి స్థానిక అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఎదుట మద్యం బాటిళ్లను పగులగొట్టి నిరసన తెలిపారు. అనంతరం మహిళా విభాగం నాయకులు మాట్లాడుతూ మొలకలచెరువులో వెలుగుచూసిన కల్తీ మద్యం తయారీ, కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రం మొత్తానికి పాకిందన్నారు.

**ఈ మౌనం దేనికి సంకేతం?**

'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు మద్యం బ్రాండ్లలో కుట్ర జరిగిపోయిందని మసిపూసి మారేడు కాయ చేశారు. తమ నాయకులే లక్ష్యంగా తప్పుడు కేసులు పెట్టి, జైలుకు పంపించారు. ఏదో జరిగిపోయిందంటూ గ్లోబల్ ప్రచారానికి దిగారు. ఇప్పుడు నకిలీ మద్యంలో కూటమి నేతలు అడ్డంగా దొరికిపోయినా మౌనంగా ఉన్నారు. ఇది దేనికి సంకేతం...?' అంటూ మహిళా నేతలు నిలదీశారు.

**సరి'హద్దు'లు దాటిన కల్తీ మద్యం**

జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు దాటుకుని స్పిరిట్ చిత్తూరులోకి వస్తున్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మహిళా నేతలు ఆరోపించారు. ఏడాదికిపైగా కల్తీ మద్యం జోరుగా సాగుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. అనంతరం ఎక్సైజ్ పోలీసులకు వినతిపత్రం అందచేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శులు పీవీ.గాయత్రీదేవి, లీనారెడ్డి, మునిసిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలి రెడ్డి, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు హరీషారెడ్డి, కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి, కౌసర్, పూంగొడి, బిందు, శాంతి, లత, విజయశాంతి, సృజన పాల్గొన్నారు.

**బడా'బాబు'లను అరెస్ట్ చేయాలి!**

కూటమి పార్టీకి చెందిన బడా నాయకుల పేర్లు బయటరాకుండా ప్రభుత్వం కల్తీ మద్యం కేసును నీరుగార్చేందుకు చూస్తోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ఆరోపించారు. నారా వారి నకిలీ మద్యం కేసులో దోషులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కల్తీమద్యం తాగి మృతి చెందిన బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. నకిలీ మద్యంలో వచ్చిన రూ.కోట్లను కూటమి నేతలంతా పంచుకున్నారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని బెల్టు దుకాణాలకు, పలు మద్యం దుకాణాలకు నకిలీ మద్యం సరఫరా అయ్యిందని, వీటిని కుటీర పరిశ్రమలుగా నడుపుతున్నారని ఆరోపించారు.

## మంట కలిసిన మానవత్వం

- చెల్లి వరుసైన వివాహితపై యువకుడి లైంగిక దాడి

**వరదయ్యపాళెం:** కామాంధులకు కళ్లు మూసుకున్న నేటి ప్రపంచంలో తల్లి, చెల్లి అన్న బంధం కూడా మంట కలుస్తోంది. అటువంటి ఘటనే శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వీకేఆర్‌పై కాలనీకి చెందిన 20ఏళ్ల గిరిజన యువతికి గుమ్మిడిపూండికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. ఆమె భర్త రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను పరామర్శించేందుకు అదే కాలనీకి చెందిన గురవయ్య అనే యువకుడు చెన్నై ఆస్పత్రికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో చికిత్స పొందుతున్న యువకుడి భార్య గురవయ్యతో కలసి బయలుదేరారు. గురవయ్య ఆమెకు అన్న వరుస అవుతాడు. మార్గం మధ్యలోని సత్యవేడు మండలం ఇరుగుళం గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో గురవయ్య ఆమెను బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై ఆమె శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గురవయ్యను అరెస్టుచేసి గురువారం సత్యవేడు కోర్టులో హాజరు పరచగా గురవయ్యకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు శ్రీసిటీ ఎస్‌ఐ అరుణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## అసలు నిందితులను అరెస్టు చేయాలి


దేవళంపేటలో అసలు నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- తిరుపతిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన

**తిరుపతి మంగళం :** గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగలపెట్టిన అసలు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర డిమాండ్ చేశారు. తిరుపతి జీవకోనలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాజకీయ కక్షలతో టీడీపీకి చెందిన సతీష్‌నాయుడు తగల పెట్టించారని ఆరోపించారు. గతంలో అక్కడ స్థానిక సర్పంచ్ గోవిందయ్య అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటే సతీష్‌నాయుడు అడ్డుకున్నాడని, అయినప్పటికీ అక్కడి దళితులంతా ఒక్కటై ఏర్పాటు చేశారన్నారు. ఆ విషయాలను మనసులో పెట్టుకుని సతీష్‌నాయుడు అంబేడ్కర్ విగ్రహాన్ని తగలపెట్టించాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ గోవిందయ్య పైనే తిరిగి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయించడం కూటమి నాయకుల అరాచకాలు, దుర్మార్గాలకు నిదర్శనమన్నారు. పోలీసులు సైతం కూటమి నాయకులకు కొమ్ముకాస్తూ అంబేడ్కర్ విగ్రహ దహనాన్ని చాలా చులకనగా తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అసలైన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ తరఫున పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అజయ్‌కుమార్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బత్తల గీతాయాదవ్, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, పార్టీ నాయకులు శ్రీనివాసులు, చేజర్ల మురళి, మద్దాలి శేఖర్, ఆటో ప్రసాద్, కుప్పయ్య, రమణ, శారద, కవితమ్మ, శాంతారెడ్డి, సరస్వతమ్మ, దుర్గ, కుమారమ్మ పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న ఆటో: వ్యక్తి మృతి


మృతి చెందిన దివాకర్

**తిరుపతి రూరల్ :** పూతలపట్టు –నాయుడుపేట ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లి క్రాస్ వద్ద బైక్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి నగరంలోని ఉప్పంగి హరిజన వాడకు చెందిన దివాకర్ చంద్రగిరిలో తన పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుపతికి వైపు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న దివాకర్ (19) కింద పడటంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాధితుడి సోదరుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ షావల్లీ కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


జశ్వంత్(ఫైల్)

**గూడూరు రూరల్ :** గూడూరు రూరల్ పరిధిలోని కాంద్ర–వెందోడు మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాయపల్లి మండలం గొట్టికాడు గ్రామానికి చెందిన జశ్వంత్(23) దుర్మరణం చెందాడు. గూడూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు గొట్టికాడు గ్రామానికి చెందిన ప్రభాకర్, జ్యోత్స్న కుమారుడు జశ్వంత్ గూడూరు పట్టణంలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చదువుకుంటూనే కుటుంబానికి చేదోడుగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఓ బ్యాంకులో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి బైక్‌పై గూడూరుకు బయలుదేరగా కాంద్ర గామానికి చెందిన శీనయ్య మోటార్ సైకిల్‌పై వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న జశ్వంత్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడిపోయిన జశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. శీనయ్యకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. మనోజ్‌కుమార్ తెలిపారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రగడ

- అటెండర్, సబ్ రిజిస్ట్రార్ మధ్య వివాదం
- సబ్ రిజిస్ట్రార్‌పై అటెండర్ దూషణల పర్వం


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో హల్‌చల్ చేస్తున్న అటెండర్ తిరుమలేష్

**రేణిగుంట :** నిత్యం అనేక ఆర్థిక లావాదేవీలు జరుగుతూ రద్దీగా ఉండే రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఉదయం అటెండర్, సబ్ రిజిస్ట్రార్ మధ్య రగడ నెలకొనడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం ఉదయం సమయానికి డ్యూటీకి రాలేదని అందరి ముందు అటెండర్ తిరుమలేష్‌ను సబ్ రిజిస్ట్రార్ ప్రశ్నించడంతో అవమానంగా భావించిన అటెండర్ సబ్ రిజిస్ట్రార్‌పై తిరగబడి ఇష్టానుసారంగా దూషించడంతో పాటు, కార్యాలయంలో లంచాలు ఎక్కువవుతున్నాయని, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం అధికంగా ఉందని పెద్దగా కేకలు వేస్తూ హల్‌చల్ చేశారు. అక్కడికి వచ్చిన విలేకరులను సైతం సబ్ రిజిస్ట్రార్‌కు వత్తాసు పలుకుతున్నారంటూ వారిపైన అటెండర్ దురుసుగా ప్రవర్తించారు. కొంతకాలం క్రితం వీరి మధ్య వివాదం నెలకొని పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. ప్రస్తుతం మళ్లీ వారి మధ్య వివాదం రాజుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి వివరణ ఇస్తూ నిత్యం అటెండర్ విధులకు ఆలస్యంగా వస్తున్నారని ఆ విషయం అడిగినందుకు తనపై దుర్భాషలాడినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానని చెప్పారు.

## మళ్లీ మోదీ వస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం

– సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

**వరదయ్యపాళెం :** నరేంద్ర మోదీని మరోసారి అధికారంలోకి రానిస్తే రాజ్యాంగం కనుమరుగై ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే ప్రమాదం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ స్పష్టం చేశారు. వరదయ్యపాళెం మండల కేంద్రంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులకు ఐదు రోజులుగా రాజకీయ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. నాల్గవ రోజు గురువారం ఉదయం దేశ , అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను కె.నారాయణ వివరించారు. ప్రపంచ దేశాల మధ్య భయంకర వాతావరణం సృష్టించి తద్వారా లబ్ధి పొందాలని అమెరికా ప్రయత్నం చేస్తోందన్నారు. అనంతరం పార్టీ కార్యక్రమం, బలమైన పార్టీ నిర్మాణం ఆవశ్యకత అనే అంశంపై జేవీఎస్ మూర్తి, భారత దేశ చరిత్ర సంస్కృతి, వక్రీకరణ అనే అంశంపై కొప్పర్తి వెంకటరమణ మూర్తి వివరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు , శిక్షణ తరగతుల ప్రిన్సిపల్‌గా పి.మురళి, కార్యదర్శిగా చిన్నిరాజ్ వ్యవహరించారు.



శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న నారాయణ